సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 21 । జనవరి । 2023



పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. -8లో..



రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.5/15.4

జిల్లాలో శుక్రవారం 15.4 – 30.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సంక్రాంతికి కడప రీజియన్ ఆదాయం రూ. 91 లక్షలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప రీజియన్ వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ నుంచి 20 వరకు 341 ప్రత్యేక బస్సులు నడిపామని, దాని ద్వారా రూ. 91,68,846 ఆదాయం వచ్చిందని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతికి ముందు 186 బస్సులు నడిపామని, 1,33,108 కిలోమీటర్లు తిప్పగా తద్వారా రూ. 51,28,590 ఆదాయం వచ్చిందన్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత ఆయా ప్రాంతాలకు 155 బస్సులను 1,15,895 కిలోమీటర్లు తిప్పగా తద్వారా రూ. 40,40,256 ఆదాయం చేకూరిందన్నారు. రీజియన్‌వ్యాప్తంగా పండుగ సందర్భంగా 341 బస్సుల ద్వారా 2,49,003 కిలోమీటర్లు నడపడం జరిగిందన్నారు. గతేడాది 86 బస్సుల ద్వారా రూ. 25,07,066 ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు.

ఫిబ్రవరి 5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

NMMS National Means Merit Scholarship

కడప ఎడ్యుకేషన్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) 2022–23 విద్యా సంవత్సరానికిగాను ఫిబ్రవరి 5వ తేదీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.హాల్ టికెట్‌ను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ తెలిపారు. కావున సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూ డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందచేయాలని డీఈఓ తెలిపారు.

చిరంజీవులు

- తనువు చాలించినా.. పలువురి జీవితాల్లో వెలుగులు
- బ్రెయిన్ డెడ్ వ్యక్తుల అవయవ దానంతో నిలుస్తున్న ప్రాణాలు
- ఇటీవల ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తుల అవయవాలు దానం
- కుటుంబ సభ్యుల నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు





అవయవదానం చేసిన సుచిత్ర మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

సుచిత్ర (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : జీవించినప్పుడే కాకుండా మరణిస్తూ కూడా నలుగురికి ప్రాణం పోయడం మనిషికి దేవుడిచ్చిన వరం. ఒక్కరిగా మరణించినా నలుగురిలో జీవించడం అవయవదానంతోనే సాధ్యమవుతోంది. తోటి వారి క్షేమాన్ని కాంక్షించి బ్రెయిన్ డెడ్ వ్యక్తులకు చెందిన కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయంతో ఎంతో మంది ఊపిరి పోసుకుంటున్నారు. తీవ్ర దుఃఖంలోనూ వారు తీసుకునే నిర్ణయాలతో అమూల్యమైన అవయవాలు మట్టిపాలు కాకుండా అనేక మందిలో వెలుగులు నింపుతున్నాయి. అవయవదానం వల్ల ఒకరు పదుల సంఖ్యలో జీవితాలను నిలబెట్టవచ్చనే విషయం చాలా మందికి తెలియదు. మనం మట్టిలో కలవక ముందే మన అవయవాలను మరి కొందరికి దానం చేసి ప్రాణం కాపాడవచ్చు. ప్రొద్దుటూరుకు చెందిన సుచిత్ర (25), బాసిరెడ్డి అభితేజరెడ్డి (15) ఇటీవల బ్రెయిన్ డెడ్ కారణంగా మృతి చెందారు. వారిద్దరి కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు అవయవాలను దానం చేశారు. అవగాహన లోపం, అపోహలు శరీరంలోని ఆర్గాన్స్ దానం చేయడానికి ప్రధాన ప్రతిబంధకాలుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు కుటుంబాలు తీసుకున్న నిర్ణయాన్ని అనేక మంది ప్రశంసిస్తున్నారు.

చిన్న వయసులోనే అవయవదానం కోసం రిజిస్ట్రేషన్

ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన దేవరశెట్టి నరసింహులు, అనురాధలకు రూపలావణ్య, సుచిత్ర అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసింహులు ఏపీ ఎస్పీడీసీఎల్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తూ రెండేళ్ల క్రితం రిటైర్ అయ్యాడు. చిన్న కుమార్తె సుచిత్ర స్థానికంగానే బీఫార్మసీ పూర్తి చేసి రెండేళ్ల నుంచి బెంగళూరులోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. గతేడాది నవంబర్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్న కంపెనీలోనే జీవన్‌దాన్ ట్రస్టు వారు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధుల సందేశం తనకు ఆలోచింపచేసేలా ఉండటంతో అవయవదానం చేస్తున్నట్లు సుచిత్ర రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 27న తలనొప్పిగా ఉందని చెప్పడంతో తోటి ఉద్యోగులు ఆమెను ప్రత్యేక వాహనంలో ప్రొద్దుటూరుకు పంపించారు. తల్లిదండ్రులు స్థానికంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయిందని చెప్పారు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి సుచరిత్రను తీసుకెళ్లారు. అక్కడ చికిత్స తీసుకుంటున్న క్రమంలో ఈ ఏడాది జనవరి 2న బ్రెయిన్ డెడ్‌తో యువతి మృతి చెందింది. అప్పటికే అవయవదానం కోసం కుమార్తె రిజిస్ట్రేషన్ చేయించినా.. తల్లిదండ్రులైన నరసింహులు, అనురాధలు అంగీకారం తెలపడంతో సుచిత్ర శరీరంలో నుంచి ఆస్పత్రిలోని ప్రత్యేక వైద్య బృందం అవయవాలను సేకరించారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి

అవయవదానంపై ప్రజల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉంది.అవయవాలు కావాలని జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అయితే అందుకు తగ్గట్టుగా అవయవదానం జరగలేదని అధికారులు చెబుతున్నారు. మనకు తెలిసిన వారు బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాల్లో వారి కుటుంబాలను ఒప్పించి అవయవాలను దానం చేసేలా చూడాలి. ప్రభుత్వం, ఎన్జీఓలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ..



మధుసూదన్‌రెడ్డి

ప్రొద్దుటూరుకు చెందిన మరో వ్యక్తి నేత్రదానంపై 14 ఏళ్ల నుంచి అవగాహన కల్పిస్తున్నారు. మధుసూదన్‌రెడ్డి 2008లో స్నేహసేవా సమితి అనే స్వచ్ఛంద సేవాసంస్థను స్థాపించారు. 2009లో డాక్టర్ వైవీ లక్ష్మీదేవి నేత్రనిధిని ఏర్పాటు చేశారు. నేత్రదానంపై జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. ఇప్పటి వరకు 502 మంది నుంచి మరణానంతరం 1004 కార్నియాలను సేకరించారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 6 వేల మందితో నేత్రదానంపై అంగీకార పత్రాలు తీసుకున్నట్లు తెలిపారు.

అవయవదానం పొందిన స్ఫూర్తితో విస్తృతంగా ప్రచారం



కొవ్వూరు రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొవ్వూరు రమేష్‌రెడ్డి అవయవదానం పొంది 2003లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2202లో ఆయనకు కాలేయం సమస్య రావడంతో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో చూపించినా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గమని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో అప్పుడే గ్లోబల్ ఆస్పత్రిని నిర్మించారు. స్నేహితుల బలవంతం మేరకు ఆయన కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళ్లారు. గ్లోబల్ ఆస్పత్రికి అది మొదటి కేసు కావడంతో అత్యంత జాగ్రత్త, శ్రద్ధతో కాలేయ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి 10 ఏళ్ల వరకు గ్యారెంటీ ఇచ్చారు. అయితే 20 ఏళ్లు దాటినా కొవ్వూరు రమేష్ రెడ్డి పూర్తి ఆరోగ్యంతోనూ. క్షేమంగా ఉన్నారు. అవయవదానం పొందిన స్ఫూర్తితో ప్రతి ఏటా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

తను లేకున్నా..



అభితేజరెడ్డి (ఫైల్)

నక్కలదిన్నె గ్రామమనేది ప్రొద్దుటూరు మండలంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆ గ్రామంలో నివసిస్తున్న బాసిరెడ్డి అభితేజరెడ్డి (15) ఈ నెల 16న బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. నిద్రలో ఉండగా అర్ధరాత్రి సమయంలో ఈ నెల 14న మతి స్థిమితం కోల్పోయిన అతని తండ్రి నరసింహారెడ్డి గొడ్డలితో దాడి చేశాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన అభితేజరెడ్డిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కోమాలో ఉన్న బాలుడు కోలుకోలేక పోవడంతో 16న రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు మృతి చెందాడని పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లి తులశమ్మకు అవయవదానంపై కుటుంబ సభ్యులు అవగాహన కల్పించారు. తన కుమారుడు చనిపోయినా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపుతాడని భావించిన తల్లి అందుకు అంగీకారం తెలిపింది. ఒక చిన్న పల్లెటూరులో అవయవదానంపై చైతన్యం రావడం అభినందించదగ్గ విషయమని బాలుడి కుటుంబ సభ్యులను పలువురు ప్రశంసిస్తున్నారు.

మా అమ్మాయిని చూసి గర్వపడుతున్నాం



మా అమ్మాయి బ్రెయిన్ డెడ్ కాక ముందు అవయవదానం చేస్తున్నట్లు జీవన్ దాన్‌లో రిజిష్టర్ చేసుకుంది. తర్వాత నెలన్నరకే చనిపోయింది. సుచిత్రను చూసి తల్లిదండ్రులుగా గర్వపడుతున్నాం. చిన్న వయసులో పెద్ద నిర్ణయం తీసుకుంది. మా కూతురు వల్ల నలుగురు ప్రాణం పోసుకుంటుంటే అంతకంటే ఆనందం ఏముంటుంది.

– నరసింహులు, అనురాధ (సుచిత్ర తల్లిదండ్రులు), ప్రొద్దుటూరు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కడపలో ర్యాలీని ప్రారంభించారు. కోటిరెడ్డిసర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా కొంతమంది వాహనదారుల్లో చలనం రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్, షీటు బెల్ట్ ధరిస్తే ప్రమాదాలు నివారించేందుకు వీలు ఉంటుందన్నారు. ప్రమాదాల నివారణకు ఈ రహదారి భద్రతా వారోత్సవాల అవగాహన ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. ఏదైనా ప్రమాదాలు జరిగినపుడు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులతోపాటు ఆర్టీసీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రహదారి భద్రతా వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ తదితరులు

నేటి నుంచి కడప రాయుని బ్రహ్మోత్సవాలు

అంకురార్పణతో ప్రారంభం

కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఉత్సవాల ప్రారంభానికి దీక్షా తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, అనంతరం అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వామితోపాటు సుదర్శన చక్రతాళ్వార్‌లను ప్రతిష్ఠించి పూజలు జరుపుతారు. అర్చకులు, కార్యక్రమ నిర్వాహకులు ఊరేగింపుగా ఆలయ పుష్కరిణి వద్దకు వెళ్లి అక్కడ పుట్టమన్ను సేకరించి (మృత్సంగ్రహణం) సంప్రదాయంగా దాన్ని పల్లకీలో ఆలయానికి చేర్చనున్నారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆ మట్టిలో బీజాలు చల్లి అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి నుంచి 9.00 గంటల వరకు తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథాగానం నిర్వహిస్తారు.



బ్రహ్మోత్సవ అలంకారంలో ఉభయ దేవేరులతో కడప రాయుడు

అన్ని ఏర్పాట్లు పూర్తి

తిరుమల తిరుపతి దేవస్థానాల అధికారులు ఆలయ స్థానిక అధికారులతో కలిసి బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయం రాజగోపురంతోపాటు ఆలయ ప్రహరీ మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవునికడపలో బ్రహ్మోత్సవ వివరాలను తెలుపుతూ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఒక్కోరకం వాహన సేవ ఉంటుంది గనుక వాహనాలలో స్వామిని కొలువుదీర్చేందుకు ప్రత్యేకంగా రాజగోపురం వెలుపల ఆలయ మండపం ఏర్పాటు చేశారు.

అయ్యో.. దేవుడా!

- చాపాడు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- తిరుమల నుంచి ప్రొద్దుటూరు వెళుతూ లారీని ఢీకొన్న టెంపో
- ముగ్గురు మహిళలు మృతి.. 8 మందికి తీవ్రగాయాలు
- 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా దుర్ఘటన



చాపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం



మృతిచెందిన రామలక్షుమ్మ



ఓబుళమ్మ



అనూష

చాపాడు/ప్రొద్దుటూరు క్రైం : పండుగకు అప్పలందరూ కలిశారు. పండుగయ్యాక గోవిందుడి సన్నిధికి వెళ్లాలనుకున్నారు. తిరుమల వెళ్లి వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరుడిని కూడా కొలిచారు. సంతోషంతో తిరుగుపయనమయ్యారు. 15 నిమిషాల్లో ఇక ఇంటికి చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ముగ్గురు తిరిగిరాని లోకాలకు చేరుకోగా.. 8మంది తీవ్రంగా గాయపడ్డారు. అందరూ గాఢ నిద్రలో ఉండగా చాపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దుర్ఘటనలో అక్కాచెల్లెళ్లతో పాటు వీరి కూతురు మృత్యువాత పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.

పులివెందుల మండలంలోని ఇనగలూరుకు చెందిన గంగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి సోదరులు 20 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. వేరుశనగక్కాయ మిల్లును ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరూ ఒకే ఇంట్లో పెళ్లి చేసుకున్నారు. గంగిరెడ్డికి భార్య రామలక్షుమ్మతో పాటు అనూష, అనిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. అనూషకు మూడేళ్ల బాబు ఉన్నాడు. భర్త విజయ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారి స్వగ్రామం వీఎన్ పల్లె మండలంలోని తాటిమాకులపల్లె. సంక్రాంతి పండుగకు రమ్మని చెప్పడంతో ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు ఇక్కడికి వచ్చారు. ప్రొద్దుటూరుకు వచ్చిన వారు మూడు రోజుల పాటు బంధువులతో సరదాగా గడిపారు. ఎలాగూ అందరూ కలిశారు కాబట్టి గంగిరెడ్డి అల్లుళ్లు, కూతుళ్లను తిరుమలకు తీసుకెళ్లాలని భావించాడు. ఈ మేరకు టెంపో వాహనాన్ని బాడుగకు మాట్లాడుకున్నారు. దర్శనానికి వెళ్లే విషయం గంగాధర్‌రెడ్డికి చెప్పడంతో భార్య ఓబుళమ్మ కూడా వారి వెంట వెళ్లింది. అందరూ కలిసి బుధవారం ఉదయం ప్రొద్దుటూరు నుంచి టెంపో వాహనంలో బయలుదేరారు. తిరుమల దర్శనం తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లారు. అక్కడ దర్శనం ముగించుకున్న అనంతరం శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరుకు బయలుదేరారు. అయితే మరో 15 నిమిషాల్లో ప్రొద్దుటూరుకు చేరుకుంటారనగా చాపాడు వద్ద రోడ్డు పక్కన ఆగివున్న బొగ్గు లారీని టెంపో ఢీ కొనడంతో తల్లీకూతుళ్లు రామలక్షుమ్మ (52), అనూష(28)తో పాటు రామలక్షుమ్మ సోదరి ఓబుళమ్మ(47)మృతి చెందారు. రామలక్షుమ్మ భర్త గంగిరెడ్డి, అనూష భర్త విజయకుమార్‌రెడ్డితో పాటు రామకృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, జయలక్ష్మీ, రామాంజనేయమ్మ, గంగా అనితలతో పాటు డ్రైవర్ ఆంజనేయరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ధరణి అనే బాలికతో పాటు మరో రెండేళ్ల పాప ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. వీరందరినీ 108 వాహనాల్లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో గంగిరెడ్డి ప్రైవేటు ఆసుపత్రికి, రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రామకృష్ణారెడ్డిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రామలక్షుమ్మ, ఓబుళమ్మ, అనూషల మృతదేహాలకు వారి స్వగ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనా స్థలాన్ని శుక్రవారం ఉదయం ప్రొద్దుటూరు ఆర్డీఓ సుశీల సిబ్బందితో కలసి పరిశీలించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

బాధితులకు ఎమ్మెల్యే రాచమల్లు పరామర్శ

చాపాడు మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డుపై నిలిపిన లారీని తిరుమల నుంచి వస్తున్న టెంపో వాహనం ఢీ కొన్న విషయం తెలిసిందే. జిల్లా ఆస్పత్రికి చేరుకున్న ఎమ్మెల్యే మార్చురీలోని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని కు టుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



గాయపడిన గంగిరెడ్డి



విజయ్‌కుమార్‌రెడ్డి



డ్రైవర్ ఆంజనేయరెడ్డి



రామాంజనమ్మ



జయలక్ష్మీ



గంగా అనిత



స్వల్పంగా గాయపడిన ధరణి

తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

కడప సిటీ : జిల్లాలోని పలువురు తహసీల్దార్లుగా సీనియారిటీ ప్రకారం డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు వచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బద్వేలు తహసీల్దార్‌గా పనిచేస్తున్న వేంపల్లె మల్లికార్జునరెడ్డిని ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా, రాయచోటి తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని పీఏ-2 స్పెషల్ కలెక్టర్‌గా, కలసపాడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.రమేష్‌రెడ్డిని పీబీసీ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతులు లభించాయి. ఇదిలా ఉండగా లింగాల తహసీల్దార్‌గా, ప్రస్తుతం సీఎం పేషీలో డిప్యుటేషన్‌లో పనిచేస్తున్న చంద్రమునిని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఆర్డీఓగా పదోన్నతి కల్పించారు.కడప పీఏ-2 స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రోహిణిని మదనపల్లె హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1కు బదిలీ చేశారు. విజయనగరం జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వి.వెంకటపతిని కడప ఎన్‌హెచ్‌ఏఐ ఎస్‌డీసీగా నియమించారు.



క్లుప్తంగా

కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి


చలమయ్య (ఫైల్)

దువ్వూరు : మండల కేంద్ర మైన పాత దువ్వూరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న జాతీయ రహదారిపై శుక్ర వారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపాడు గ్రామానికి చెందిన కొలిశెట్టి చలమయ్య (62) దువ్వూరులో వ్యక్తిగత పనులు ముగించుకుని, స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. దువ్వూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా కడప నుంచి కర్నూలు వైపు కారు వస్తోంది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చలమయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

పులివెందులలో చోరీ


బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణ పరిధి ముద్దనూరు రోడ్డులోని జయమ్మ కాలనీలో రూ.50 వేల నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జయమ్మ కాలనీకి చెందిన శ్రీను బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ మాదిరిగా శుక్రవారం ఉదయం బేల్దారి పని నిమిత్తం వెళ్లాడు. ఇంటికి వచ్చే సరికి తలుపులు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న రూ.50 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి


నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కడప నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. 174 సి.ఆర్.పి.సి (అనుమానాస్పద మృతి) కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతోపాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. నిషేధిత గుట్కా, దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వివరించారు. ఎస్.హెచ్.ఆర్.సి, ఎన్.హెచ్.ఆర్.సి ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు ప్రశంస


వన్‌స్టాప్ సెంటర్ సైకాలజిస్ట్ సునీతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లా పోలీసు యంత్రాంగంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి విశేష సేవలు అందించిన వారికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. శుక్రవారం కడపలోని 'పెన్నార్' కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో మహిళా పోలీసులు, వన్‌స్టాప్ సెంటర్ అధికారులు, సిబ్బంది, స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు, కమాండ్ కంట్రోల్ సిబ్బంది, ట్రాఫిక్ విభాగం, కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. 'దిశ'మహిళా పోలీస్‌స్టేషన్‌లోని వన్‌స్టాప్ సెంటర్ సైకాలజిస్ట్, సోషల్ కౌన్సిలర్ పి.వి.సునీత, కంప్యూటర్ ఆపరేటర్ పుష్పలత, న్యాయవాది ఉమ, మహిళా పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్లు బాలరాజు, వెంకటసుబ్బయ్య, మురళీమోహన్, కమాండ్ కంట్రోల్ ఏఎస్ఐ నాయక్, కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుళ్లు కె.పి.రాజు, సుబ్బరాయుడు, హోం గార్డు శ్రీనివాసులు ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

- కబడ్డీ సంఘం ప్రతినిధులు
- జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం కడప నగరంలోని బసవతారం న్యాయకళాశాల ఆవరణలో జిల్లాస్థాయి సీనియర్ విభాగం మహిళలు, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం కోశాధికారి, కోచ్ జనార్ధన్ మాట్లాడుతూ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 150 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు అంజని, చౌడేశ్వర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు సురేష్‌యాదవ్, సుకుమార్, సురేంద్ర, జుల్ఫికర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మహిళల జట్టు : ఎస్.రుక్సాన, ఎస్.పూజ, ఎ.పుష్పలత, ఎం.మమత, ఎస్.నాగజ్యోత్స్న, ఎస్.ఇందు, టి.భార్గవి, వై.రజిత, సి.భార్గవి, ఎం.పౌర్ణమి, టి.మైథిలి, ఆర్.మహి. స్టాండ్‌బై : చంద్రవదన, టి.కావ్యశ్రీ, బి.మానస, సి.హరిణి, ఎం.ప్రమీల.

పురుషుల జట్టు : కె.శివారెడ్డి, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రేమ్‌చంద్‌రెడ్డి, బి.ఇర్ఫాన్, ఎస్. కిరణ్‌కుమార్, వంశీధర్‌రెడ్డి, ఎం.రాజ్‌కుమార్‌నాయక్, సి.చెన్నకృష్ణ, చెన్నకేశవరెడ్డి, బి.వంశీ, స్టాండ్‌బై : టి.సుకుమార్, అనిల్‌చౌదరి, ప్రదీప్‌కుమార్.

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప సిటీ : రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు కె.నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందించాలని సూచించారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

రాష్ట్ర ఉద్యానసలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్ర బాగుంటుందన్న నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడంలో మార్కెట్ కమిటీలు మూల స్తంభాల్లా పనిచేయాలన్నారు. అనంతరం వ్యవసాయశాఖ రూపొందించిన 2023 సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయశాఖజేడీ నాగేశ్వరరావు, ఉద్యానశాఖ డీడీ మైఖేల్‌రాజీవ్, ఆత్మ పీడీ విజయకుమారి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ శారద, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రామకృష్ణ, సివిల్ సప్లయ్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి గ్రామీణ క్రికెటర్లతో జాతీయ పోటీలు

జీసీఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు సువర్ణరాజు

కడప రూరల్ : హైదరాబాద్‌లోని చిలుకూరులో ఈ నెల 31వ తేదీ నుంచి గ్లోబల్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (జీసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో జీపీఎల్ టీ–20 జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు తెలిపారు. కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ ట్రోఫీ పేరిట ఫిబ్రవరి 3వ తేదీ వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో దేశంలోని 16 రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొంటాయన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలతోపాటు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. క్రికెట్ కార్పొరేట్ క్రీడగా కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లను వెలుగులోకి తేవడానికి ఇలాంటి పోటీలు చేపట్టామన్నారు. ఆ మేరకు తమ అసోసియేషన్ తరఫున 2009వ సంవత్సరం నుంచి గ్రామీణ క్రికెటర్లతో వివిధ దశల్లో పోటీలను నిర్వహించామన్నారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో అత్యుత్తమ క్రికెటర్లతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రికెటర్లను అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అడ్వైజర్ రమణారావు, సభ్యులు రామచంద్రారెడ్డి, తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఖాదర్ బాష పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

సిద్దవటం : మండల పరిధి వంతాటిపల్లె గ్రామ పంచాయతీ లంకమల అడవుల్లోని శ్రీ నిత్యపూజస్వామి కోనలో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె గ్రామానికి చెందిన కోడూరు చలపతిగా గుర్తించారు. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోడూరు చలపతి అప్పుడప్పుడు శ్రీ నిత్యపూజస్వామి కోనకు వస్తుంటారు. అందులో భాగంగా సోమవారం ఇక్కడికి వచ్చారు. అనంతరం తిరిగి ఇంటికి వెళ్లకుండా అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు, బంధువులు తెలిసిన ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. శ్రీ నిత్యపూజస్వామి కోనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారని గురువారం గుర్తించారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి రావడంతో వెంటనే మృతుడి భార్య అయ్యవారమ్మ, కుమారులు మధన్, భరత్ కుమార్, బంధువులు పంచలింగాల వద్దకు చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని చూసి చనిపోయింది తన భర్తేనని అయ్యవారమ్మ గుర్తించి, బోరున విలపించారు. మృతదేహానికి అక్కడే డాక్టర్ దినేష్ పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

APS RTC
టెండరు ప్రకటన
YSR ... HSD ... https://www.apsrtc.ap.gov.in లో Tenders ... APSRTC ...
నం.E3/787(01)/2023-DPTO(YSR), తే: 20-01-2023 ... YSR కడప

రేషన్ బియ్యం స్వాధీనం

బద్వేలు అర్బన్ : బద్వేలులోని చెన్నంపల్లె సమీపంలో గల ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 620 బస్తాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున ఆర్డీవో ఆకులవెంకటరమణ స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉంచిన లారీని కూడా పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని మైదుకూరు ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ తెలిపారు.

సిద్దేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కడప రూరల్ : సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జికి బదులుగా రోడ్ కమ్ బ్యారేజీని నిర్మించాలని మాజీ ఎంఎల్ఏ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే చలో సిద్దేశ్వరం, సంగమేశ్వరం రాయలసీమ ప్రజా ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడపలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిష్ణా డెల్టాకు, నాగార్జున ప్రాజెక్టుకు.. శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మాత్రమే మిగిలి పోయిందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అత్యధికంగా విద్యుత్ ఉత్పాదన జరుగుతోందన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల రాయలసీమ ప్రాంతానికి పెద్దగా ప్రయోజనం లేదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, సిద్దేశ్వరం, ఆత్మకూరు, నంద్యాల మీదుగా జాతీయ రహదారి 167 కేడీని ప్రతిపాదించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనను అవకాశంగా తీసుకొని సిద్దేశ్వరం వద్ద తీగల వంతెనకు బదులుగా రోడ్ కమ్ బ్యారేజీని నిర్మిస్తే తాగు, సాగు నీటి అవసరాలకు ఇటు రాయలసీమ.. అటు తెలంగాణకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. బాలక్రిష్ణయాదవ్, మాచినేని రామసుబ్బయ్య, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ, Diploma, B.Tech, BCA, MCA పాసయ్యే ఛాన్స్ కలదు. నాగేష్ అకాడమి, కడప. 7569470023 [G-5962]

REAL ESTATE
PLOT FOR SALE
■ ఊటీ (Ooty Tamilnadu) ఆహ్లాదకరమైన వాతావరణంలో 7 ఎకరాల భూమి లో ఇల్లు గెస్ట్ హౌసెస్ మరియు విల్లాలు కట్టుటకు అమ్మబడును. ఫోన్ : 9500108888. [HA-28277]

SERVICES
■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ 7836035286, 8901923173. [W-775803]

ఆయుర్వేదాలయం
■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి–సెల్: 7738897455 [K-1141937]

పాస్‌పోర్ట్ పోయినది
■ I, BALA GANGAIAH TUMMALA S/o. GANGAIAH TUMMALA, R/of D.No: 2/105, Pabbapuram, C.K.Dinne (M), YSR (Di), A.P-516003. Original Passport No: L2224609 గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. దొరికిన వారు తెలుపగలరు. సంప్ర: 7981937297. [C-781313]

CHANGE OF NAME
■ GRANDHE RAVEENDRA KUMAR (Old name) Change my name as GRANDHE RAVINDRA KUMAR (New name), S/o. GRANDHE VENKATA SUBBAIAH, 4/16-2, Ravindra Nagar, Kadapa, YSR District. [C-1161865]

■ I, KUPPAM ANNAPURNAMMA (old name), W/o. KUPPAM NARASANNA GARI AMARNATH, Resident of Door No. 47/78-B, Bose Nagar, Annamaya Dist, A.P., have changed my name as KUPPAM NARASANNA GARI ANNAPURNAMMA, W/o KUPPAM NARASANNA GARI AMARNATH (New Name). [C-781314]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V- 6038]

BUSINESS OFFER
■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

WANTED
■ శ్రీ వెంకటేశ్వర ఆటో ఫైనాన్స్‌యర్స్ నందు పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ 7680902212. [C-781312]

■ బ్యూటి పార్లర్ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన బ్యూటీషియన్ కావలెను. స్త్రీలకు మాత్రమే. కడప, యర్రముక్కపల్లి. 9110514974, 9703970901. [C-781315]

■ మార్కెటింగ్: ఒక ప్రముఖ రెడ్ శాండిల్ ఫాం ప్రాజెక్ట్ నందు మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ప్రాజెక్ట్ ఏరియా కనిగిరి. సీనియర్స్ కి క్యాడర్ వైజ్ ప్రమోషన్స్ & ఇన్సెంటివ్స్. మంచి కెరీర్ ఉండును. PH: 7013276170. [C-1161488]

■ ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన వంట మాస్టర్ (మహిళలు) కావలెను. ఆకర్షణీయమైన జీతం, హాస్టల్ నందు వసతి, భోజన సౌకర్యం కల్పించబడును. 8074597769, 9000242657. [C-781303]

■ కడప నగరానికి దగ్గర ఉన్న కొప్పర్తిలో ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్సు కావలెను. 12 గంటలు డ్యూటీ, 10 వేలు జీతం. 8 గంటలు డ్యూటీ, 7000 జీతం. సెల్ నెం: 9885698190, 7702936190. [C-1205072]

■ VIP's ఇంట్లో పేషెంట్ ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను, ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp. Dr. Q:5th-Degree, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995374999 [HA-898]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ. 18k. ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్ : 9640259988, 9640198899. [H-786821]

■ ఎర్రగుంట్ల కృష్ణానగర్‌లోని సిమెంటు ఫ్యాక్టరీకి సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం॥, 26 రో॥, ఆకర్షణీయమైన జీతం, PF, ESI. Q: 10th +వ: 22-40Y ✆ 90103 26387, 92463 25282 [B-786726]

■ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 నుంచి 20 వేల వరకు జీతం. మరిన్ని వివరాలకై. 7815811791, 6301728311 [G-776040]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190552]

■ APSSP Govt (R) సంస్థలో Job చేయుటకు యువకులు కావలెను. Age: 17 to 26, అర్హత: 7th to Degree P/F నో ఫీజు, రూం్ఫ్రీ సంప్ర: 9703481420 [T-1159995]

■ ప్రముఖ రెడ్ శాండిల్ కంపెనీ ఫామ్‌ల్యాండ్స్‌ను ఎకరాలుగా (లీజ్) యూనిట్స్‌గా డీలర్‌షిప్ తీసుకుని మార్కెటింగ్ చేయుటకు స్ట్రాంగ్ పర్సన్స్ కావలెను. లక్షల్లో ఆదాయం. 9440663568 [G-779513]

■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రీడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 6301341831, 9441018078. [A-7610]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776043]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010224479
9010223797
9705898007

23న గ్రహణ మొర్రి బాధితులకు శిబిరం

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన గ్రహణ మొర్రి బాధితులకు ఈనెల 23న ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బసవతారకం స్మైల్ ట్రెన్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కడపలోని సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ముకుందరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి హైదరాబాదులోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధితులకు అలవెన్స్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

కుక్కల దాడి.. 20 గొర్రె పిల్లలు మృత్యువాత

జమ్మలమడుగు : మండల పరిధి పొన్నతోట గ్రామంలోని గురునారాయణకు చెందిన 20 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. ఆయన శుక్రవారం గొర్రె పిల్లలను జల్లలో ఉంచి భోజనానికి వెళ్లాడు. ఇదే అదనుగా దాదాపు ఆరు కుక్కలు జల్లను తొలగించి అందులో ఉన్న గొర్రె పిల్లలను చంపేశాయి. భోజనం చేసి వచ్చిన గురునారాయణ.. చనిపోయిన గొర్రె పిల్లలను చూసి బోరున విలపించారు. వాటి విలువ రెండున్నర లక్షల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

చెన్నూరు : మండలంలోని బలసింగాయపల్లెకు చెందిన మేకల యల్లయ్య (55) అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు... మేకల పుల్లయ్య ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం తన స్నేహితునితో కలిసి మద్యం సేవించి తన ఇంటిలోకి వెళ్లి గడియ పెట్టుకోవడం జరిగింది. భార్య వేరుగా ఉండడంతో ఆయన ఇంటిలో ఉన్న విషయం ఎవరూ గమనించలేదు. శుక్రవారం ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో పక్కన గల వారు కిటికీలో నుంచి చూడగా యల్లయ్య మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వారు వలంటీర్‌కు సమాచారం ఇవ్వడంతో భార్య కృష్ణవేణి పోలీసులను ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యల్లయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

– నీట మునిగి బాలుడి మృతి


మృతి చెందిన రియాజ్

ఎర్రగుంట్ల : సరదాగా బావిలో ఈతకు దిగిన బాలుడు నీట మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్ల పట్టణంలోని వినాయకనగర్‌కు చెందిన షేక్ గఫార్‌షావలి, మున్నీషాలకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమార్తెలు, రియాజ్ (17) అనే కుమారుడు ఉన్నారు. గఫార్‌షావలి సమీపంలోని పాలీష్ మిషన్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రియాజ్ కూడా పని చేస్తూ కుటుంబానికి చెదోడు వాదోడుగా ఉండే వాడు. బంధువుల పుట్టింట్రుకల కార్యక్రమానికి కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం పెద్దవంగళి దర్గా వద్దకు వెళ్లాడు. అక్కడ తోటి బాలురతో కలిసి సమీపంలోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. రియాజ్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. ఎంతకూ బయటకు రాక పోవడం గమనించిన సహచరులు బంధువులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులతో కలిసి బావిలో గాలించగా రియాజ్ మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా అరుణకుమారి


డీఈఓను కలిసిన ఎస్‌జీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్/స్పోర్ట్స్ : స్కూల్స్ గేమ్స్ సెక్రటరీగా బి.అరుణకుమారి, జాయింట్ సెక్రటరీగా జిలానీబాషలను నియమిస్తూ డీఈఓ దేవరాజు నియామక పత్రాలను జారీ చేశారు. ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం మేర మహిళా వ్యాయామ ఉపాధ్యాయులకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా నియమించాలని సూచించింది. ఇందులో భాగంగా కమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పని చేస్తున్న అరుణకుమారిని జిల్లా కార్యదర్శిగాను, ఒంటిమిట్ట మండలం మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పని చేస్తున్న ఎస్.జిలానీ బాషను జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు నిత్య ప్రభాకర్, సాజిత్, విజయ లక్ష్మి తదితరులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు డీఈఓ దేవరాజును మర్యాద పూర్వకంగా కలిసి పూలగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.

రేపు స్పెల్‌బీ సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ (మూడవ రౌండ్) పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరీల వారీగా తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని హోలీగ్రీన్ పాఠశాలలో నిర్వహించనునున్నట్లు సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తెలిపారు. ఇది వరకు పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చూపి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తిరుపతి, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు కేటగిరి–1, 10.30 నుంచి 11 గంటల వరకు కేటగిరి–2, 11 నుంచి 11.30 గంటల వరకు కేటగిరి–3, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరి–4 విభాగాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు వారి స్కూల్ యూనిఫాం, ఐడీ కార్డుతోపాటు పెన్ను/పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్‌తో పరీక్ష సమయానికి ముందే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన తరువాత అనుమతి ఉండదని ఆయన వివరించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9010224479, 9912440776

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.